సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం । 5 । ఆగస్టు । 2024



ఇక స్వచ్ఛదనం..
రాష్ట్ర ప్రభుత్వం ప్రజల భాగస్వామ్యంతో సోమవారం నుంచి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం చేపట్టనుంది. 8లో



బొగ్గు బావుల వేలం ఆపాలి
బొగ్గు బావుల వేలం ఆపాలని సీపీఎం నాయకులు కోరారు. ఆదివారం ఇల్లెందులో సింగరేణి పరిరక్షణ యాత్ర సాగింది. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
32° / 25°
జిల్లాలో సోమవారం రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు స్వర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్‌: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్ర స్వామివారికి ఆదివారం వైభవంగా స్వర్ణ పుష్పార్చన గావించారు. తెల్లవారు జామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. కాగా , పుష్యమి నక్షత్రం సందర్భంగా స్వామివారికి పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్‌: పెద్దమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. రాష్ట్రంలోని పలుప్రాంతాలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించగా, భక్తులు క్యూలైన్‌ ద్వారా దర్శించుకున్నారు. అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో జిల్లా అధికారులంతా పాల్గొంటున్న ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్‌ జితేష్‌ వి.పాటిల్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి దరఖాస్తులు అందజేేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని కోరారు.

సింగరేణిలో 47 మంది అధికారుల బదిలీ



సింగరేణి కార్యాలయం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో 47 మంది మైనింగ్‌ అధికారులను బదిలీ చేస్తూ శనివారం అర్ధరాత్రి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో ఇద్దరు అడిషనల్‌ జీఎంలు, 17 మంది డీవైజీఎంలు, ఐదుగురు ఎస్‌వోఎంలు, ఒకరు కాలరీ మేనేజర్‌, 12 మంది అడిషనల్‌ మేనేజర్లు, నలుగురు డిప్యూటీ మేనేజర్లు, ఇద్దరు ఎస్‌ఈలు, ఒకరు డీవైఎస్‌ఈ, ముగ్గురు సీనియర్‌ అండర్‌ మేనేజర్లు ఉన్నారు. అందరూ బదిలీ ప్రాంతాల్లో రిపోర్ట్‌ చేయాలని యాజమాన్యం ఆదేశించింది.

మణుగూరు జీఎంతో పాటు మరో 14 మంది మైనింగ్‌ అధికారుల బదిలీలు రద్దు

రాష్ట్రంలో ఎన్నికల కోడ్‌ రాకముందే గత మార్చి 11న మణుగూరు జీఎం దుర్గం రాంచందర్‌ను హైదరాబాద్‌లోని సింగరేణి సీ అండ్‌ ఎండీ కార్యాలయానికి బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంతకంటే ముందు పలువురు అధికారులను వివిధ ప్రాంతాలకు బదిలీ చేసింది. వీరి బదిలీలను రద్దు చేస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అయితే రద్దు వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

నేడు గిరిజన దర్బార్‌

భద్రాచలంటౌన్‌: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్‌ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే గిరిజన దర్బార్‌లో ఆదివాసీ గిరిజనుల సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేయాలని పేర్కొన్నారు.

జిల్లా.. ప్రయోగాల ఖిల్లా



పగిడేరులోని బోరు నుంచి వస్తున్న వేడి నీరు (ఫైల్‌)

విద్యుదుత్పత్తి ప్రయోగాలకు నిలయంగా భద్రాద్రి

- పాల్వంచలో తొలి థర్మల్‌ విద్యుత్‌ కేంద్రం
- పంప్డ్‌ స్టోరేజీ హైడల్‌ ప్రాజెక్ట్‌కు ఇల్లెందు ఎంపిక
- తాజాగా జియో థర్మల్‌ పవర్‌ స్టేషన్‌కు గ్రీన్‌ సిగ్నల్‌

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పారిశ్రామిక రంగంలో ప్రయోగాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వేదికగా నిలుస్తోంది. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత తొలిసారిగా కొత్తగూడెం థర్మల్‌ విద్యుత్‌ కేంద్రాన్ని పాల్వంచలో నిర్మించారు. ఇప్పుడు సంప్రదాయేతర విధానంలో సింగరేణి సంస్థ భారీ ఎత్తున సోలార్‌ పవర్‌ ప్లాంట్లు నిర్మించింది. ఇదే ఒరవడిలో పంప్డ్‌ స్టోరేజీ హైడల్‌ విద్యుత్‌ కేంద్రం, జియో థర్మల్‌ విద్యుత్‌ కేంద్రాలు కూడా ఈ జిల్లా నుంచే మొదలు కానున్నాయి.

పగిడేరు అనుకూలతలు

దేశంలో మిగిలిన ప్రదేశాలకు లేని అనుకూలతలు మణుగూరు మండలం పగిడేరు సమీపంలోని నీటి ఊటలకు ఉన్నాయి. హిమాలయాలు, దట్టమైన అటవీ ప్రాంతాల వంటి భౌగోళిక ఇబ్బందులు ఇక్కడ లేవు. పైగా మైదాన ప్రాంతంలో జనావాసాల దగ్గర ఉండటం వల్ల రోడ్డు, రైలు ద్వారా సులువుగా వేడి నీటి ఊటలు ఉన్న ప్రదేశం వరకు చేరుకోవచ్చు. అంతేకాకుండా భద్రాద్రి థర్మల్‌ పవర్‌ ప్లాంట్‌ సమీపంలోనే ఉండడం వల్ల గ్రిడ్‌ కనెక్టివిటీకి అదనపు వ్యయం చేయాల్సిన అవసరం లేదు. దీంతో ఓఎన్‌జీసీ, తెలంగాణ రెడ్కో, సింగరేణి సంస్థల మధ్య జియో థర్మల్‌ పవర్‌ ప్లాంట్‌ ఏర్పాటుపై త్రైపాక్షిక ఒప్పందం చేసుకున్నాయి.

3,500 మెగావాట్లు

గడిచిన ఐదారేళ్లుగా పగిడేరు దగ్గరున్న వేడినీటి ఊటల దగ్గర 20 కిలోవాట్‌ల విద్యుత్‌ ఉత్పత్తిని సింగరేణి సంస్థ చేపడుతోంది. ప్రస్తుతం కుదిరిన త్రైపాక్షిక ఒప్పందం మేరకు తొలి విడతలో 122 మెగావాట్ల సామర్థ్యంతో జియో థర్మల్‌ విద్యుత్‌ కేంద్రాన్ని నిర్మిస్తారు. ఆ తర్వాత వచ్చే ఫలితాల ఆధారంగా విస్తరణ పనులు ఉంటాయి. ఇప్పటి వరకు చేపట్టిన పరిశోధనల ప్రకారం మణుగూరు ప్రాంతంలో 3,500 మెగావాట్ల మేరకు జియో థర్మల్‌ విద్యుత్‌ ఉత్పత్తికి అవకాశం ఉన్నట్లు తేలింది.

ఇల్లెందులో పంప్డ్‌ స్టోరేజీ

బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయిన ఓపెన్‌ కాస్ట్‌ గనులు, సోలార్‌ పవర్‌ స్టేషన్‌లను ఉపయోగించుకుంటూ పంప్డ్‌ స్టోరేజీ విధానంలో జల విద్యుదుత్పత్తికి సింగరేణి శ్రీకారం చుట్టింది. సింగరేణి వ్యాప్తంగా పది ఏరియాలు ఉండగా పంప్డ్‌ స్టోరేజీ ప్రాజెక్ట్‌కు ఇల్లెందు ఏరియాలోని జవహర్‌ఖని ఓసీ ఎంపికైంది. ఇక్కడ తొలి దశలో 100 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్‌ స్టోరేజీ హైడల్‌ ప్రాజెక్టు నిర్మించబోతున్నారు. దీనికి సంబంధించిన డీపీఆర్‌ను టాటా గ్రూపు సంస్థ రూపొందిస్తోంది. మణుగూరు, ఇల్లెందు, కొత్తగూడెంల్లో సోలార్‌ విద్యుత్‌ కేంద్రాలు విజయవంతంగా పని చేస్తున్నాయి.

వేడి నీటి ఊటలు

భూమి నుంచి వేడి నీరు ఊటల రూపంలో బయటకు రావడాన్ని ఆర్టిసియన్‌ వెల్స్‌గా పేర్కొంటారు. భూగర్భంలో ప్రవహించే నీటి ప్రవాహానికి అంతర్గతంగా ఉన్న రాళ్లతో జరిగే రాపిడి, ఒత్తిడి కారణంగా నీరు వేడెక్కి ఆర్టిసియన్‌ వెల్స్‌ రూపంలో బయటకు వస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ వేడినీటి ఊటల ఆధారంగా అమెరికా, యూరప్‌ దేశాల్లో ఇప్పటికే జియో థర్మల్‌ పవర్‌ ప్లాంట్లు పని చేస్తున్నాయి. మన దేశంలో వేడి నీటి ఊటలు (ఆర్టిసియన్‌ వెల్స్‌) ఇప్పటివరకు 381 వరకు గుర్తించారు. వీటిలో నూటికి తొంభైశాతం నీటి ఊటలు హిమాలయ పర్వత ప్రాంతాల్లోనే ఉన్నాయి. ఉత్తరాఖండ్‌లో చార్‌ధామ్‌ యాత్రలో ఉష్ణగుండాలుగా పిలిచే చోట ఉండే వేడి నీటి ఊటల్లో భక్తులు స్నానాలు చేయడమనేది చాలా మందికి సుపరిచితమే. మన రాష్ట్రంలో ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నపేట దగ్గర వేడి నీటి ఊటలు ఉన్నాయి. 1980వ దశకంలో ఈ వేడి నీటి ఊటల దగ్గర ఓఎన్‌జీసీ పరిశోధనలు చేసింది. అయితే ఆ ఫలితాలు సానుకూలంగా రాలేదు. ప్రస్తుతం దేశంలో ఆరు ప్రాంతాల్లో జియో థర్మల్‌ పవర్‌ ప్లాంట్‌కు అనుకూలమైన ప్రదేశాలుగా గుర్తించారు.

రైతులను ముంచుతున్న గోదావరి



ఇటీవల వచ్చిన గోదావరి వరదలకు దెబ్బతిన్న పత్తి చేను

- ఏటా వరదలకు తీరప్రాంతంలో పంట నష్టం
- మళ్లీ సాగు చేయాల్సి రావడంతో సీజన్‌ ఆలస్యం
- అదును దాటడంతో తగ్గుతున్న దిగుబడులు
- యాసంగీ ఆలస్యం.. గాలివానలకు అప్పుడూ నష్టం

బూర్గంపాడు: వరుసగా మూడేళ్ల నుంచి గోదావరి వరదలు రైతులను ముంచుతున్నాయి. గత నష్టాల నుంచి తేరుకోకముందే ఈ ఏడాది అదే పరిస్థితి నెలకొంది. వరదలతో గోదావరి పరీవాహక భూముల్లో పంటల సాగు ఆలస్యమవుతోంది. ఐదారు రోజుల క్రితం వరకు వందల ఎకరాల్లో పంటలు నీటమునకలోనే ఉన్నాయి. పత్తి, వరినార్లు, వరినాట్లు, కంది, పెసర కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో మళ్లీ సాగు చేయాలంటే రైతు చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి నెలకొంది. సాగు చేసినా అదును దాటి పోతుండటంతో దిగుబడులు తగ్గుతాయి.

సీజన్‌ నెల ఆలస్యం...

ఇటీవల వచ్చిన గోదావరి వరదలకు భద్రాచలం రెవెన్యూ డివిజన్‌లోని బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక, చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో వందల ఎకరాల పంటలు నీట మునిగాయి. పత్తి పంట పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. మళ్లీ విత్తనాలు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పత్తి పంటలో ఎకరాకు రూ.15 వేల వరకు ఖర్చు చేశారు. మళ్లీ గింజలు కొని వేసుకోవాలంటే ఎకరాకు కనీసం రూ. 8వేల వరకు ఖర్చవుతుంది. వరినాట్లు వేసేందుకు జూలై మొదటి వారంలో నార్లు పోసుకున్నారు. ఆగస్టు మొదటి వారంలో వరినాట్లు వేసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్న తరుణంలో వరినార్లు మునిగి పాడైపోయాయి. మళ్లీ నార్లు పోసుకుని నాట్లు వేయాలంటే మరో నెలరోజులు ఆలస్యం అవుతుంది. ఖర్చు పెరగడంతోపాటు వానాకాలం పంటల సాగు.. ఆ తర్వాత యాసంగి సాగు కూడా మరింత ఆలస్యమయ్యే పరిస్థితులున్నాయి. రెండేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంటోంది. సీజన్‌ ఆలస్యంకావడంతో ఏప్రిల్‌, మే నెలలో వచ్చే గాలివానలకు యాసంగి పంట కూడా నష్టపోవాల్సివస్తోంది. ఎండల తీవ్రత కూడా పెరిగి దిగుబడులపై ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో గోదావరి పరీవాహకంలో పంటలు సాగు చేయాలంటేనే రైతులు జంకుతున్నారు.

ఐదెకరాలు నష్టపోయాను



గోదారి వరదలకు మూడెకరాల్లో పత్తి, రెండెకరాల్లో కూరగాయల తోట నీటమునిగి పూర్తిగా పాడయ్యాయి. ఇప్పటికీ వరదలు పూర్తిగా తగ్గలేదు. ఈ ఏడాది రూ. 75 వేల నష్టం జరిగింది. గతేడాది వరకు రూ.లక్ష నష్టం వచ్చింది. మళ్లీ పంటలు వేయాలంటే ఆర్థిక ఇబ్బంది.

-రాసాల ముత్తయ్య, రైతు, బూర్గంపాడు

అదును దాటిపోతోంది...



ముందుగా పంటలు వేస్తే వరదల పాలవుతోంది. వరదలు తగ్గాక భూములను దున్ని విత్తనాలు వేసే సరికి ఆగస్టు గడుస్తోంది. అదును దాటిపోతోంది. సెప్టెంబర్‌ నెలాఖరుకు వర్షాలు తగ్గడంతో పంటలు ఎదక దిగుబడి పడిపోతోంది. పంట నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలి.

-దారం వెంకటరెడ్డి,రైతు, సంజీవరెడ్డిపాలెం

స్వల్పకాలిక రకాలు సాగు చేసుకోవాలి



గోదావరి వరదలు తగ్గాక రైతులు స్వల్పకాలిక వరి వంగడాలను సాగు చేసుకోవాలి. పత్తిలో కూడా సింగిల్‌ పికింగ్‌ విత్తనాలు అందుబాటులో ఉంటున్నాయి. ఈ రకాలు తొందరగా కాపు కాస్తాయి. యాసంగి పంటల సాగు ఆలస్యం కాకుండా ఉండాలంటే స్వల్పకాలిక రకాలను సాగే మేలు.

-బి.తాతారావు , ఏడీఏ, మణుగూరు

ప్రత్యేకాధికారుల పాలనకు వేళాయె..

- నేటితో ముగియనున్న ఎంపీటీసీల పదవీ కాలం
- రేపటితో పూర్తికానున్న జెడ్పీ పాలవర్గం గడువు
- ఇక పరిషత్‌ల్లో ప్రత్యేక పాలనకు రంగం సిద్ధం



జెడ్పీ కార్యాలయం

చుంచుపల్లి: స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసింది. జిల్లాలో ఎంపీటీసీలకు సోమవారంతో, జెడ్పీటీసీలకు మంగళవారంతో పదవీ కాలం పూర్తికానుంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు మాజీలు కానున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో మండల, జిల్లా పరిషత్‌ల్లో ప్రత్యేక పాలనకు రంగం సిద్ధమైంది. జెడ్పీ బాధ్యతలను కలెక్టర్‌ పర్యవేక్షించనుండగా, 21 మండలాలకు జిల్లాస్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించనున్నారు. వారంతా మంగళవారం నుంచి ఎంపీడీఓ కార్యాలయాల్లో మండల ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. ఎంపీటీసీ సభ్యుల పదవీ కాలం సోమవారంతో ముగియనుండగా, జిల్లా వ్యాప్తంగా మండల పరిషత్‌ల పాలకవర్గాల గడవు కూడా ముగుస్తుంది. జిల్లా వ్యాప్తంగా 220 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, 209 మంది ఎంపీటీసీలు ఎన్నికల్లో సభ్యులుగా గెలుపొందారు. బూర్గంపాడు మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలకు అసలు ఎన్నికలు జరగలేదు. ఇక పలు కారణాలతో మరో 9 ఖాళీలు ఏర్పడ్డాయి. కాగా ఎంపీటీసీ సభ్యులు 2019 ఆగస్టు 6న ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆది నుంచి తమకు విధులు కేటాయించాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా లాభం లేకపోయింది. ఐదేళ్ల కాలంలో ఎంపీటీసీ సభ్యులకు ఆశించిన మేర నిధులు కూడా మంజూరు కాకపోవడంతో తీవ్ర నైరాశ్యంలో ఉన్నారు.

రేపటితో ముగియనున్న జెడ్పీ పాలన

జిల్లా పరిషత్‌ పాలకవర్గం గడువు కూడా మంగళవారంతో ముగియనుంది. జిల్లాలో 21 మంది జెడ్పీటీసీ సభ్యులు ఉండగా, మొదట జెడ్పీ చైర్మన్‌గా కోరం కనయ్య కొనసాగారు. ఆయన రాజీనామాతో గతేడాది డిసెంబర్‌లో వైస్‌ చైర్మన్‌ కంచర్ల చంద్రశేఖర్‌రావుకు చైర్మన్‌గా అవకాశం దక్కింది. జెడ్పీ అధ్యక్ష స్థానంలో కలెక్టర్‌ ప్రత్యేక అధికారిగా ఉండే అవకాశం ఉంది. 2019 ఆగస్టు 7న జెడ్పీటీసీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఇక మండలంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నా.. మొదట మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసి ఆమోదం పొందాల్సి ఉంటుంది. మండల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందించే నిధులతో పాటు స్థానికంగా వచ్చే ఆదాయాన్ని ఎంపీడీఓలు డ్రాయింగ్‌ అధికారిగా ఖర్చు చేయొచ్చు. కానీ కేంద్రం అందించే 15వ ఆర్థిక సంఘం నిధులను ఎంపీడీఓలతో పాటు ఎంపీపీలు సంయుక్తంగా డాంగిల్‌ విధానం ద్వారా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎంపీపీల పదవీ కాలం ముగియడంతో వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమిస్తారు. ఇక నుంచి ఎంపీడీఓతో పాటు ప్రత్యేక అధికారులు సమన్వయంతో ముందుకు సాగాల్సి ఉంటుంది. ఇక నుంచి ఎలాంటి అభివృద్ధి పనులు చేయాలన్నా ప్రత్యేక అధికారి అనుమతి పొందాల్సి ఉంటుంది. మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి కొత్త పాలకవర్గాలు కొలువు దీరే వరకు మండల పరిషత్‌లలో ఈ ప్రత్యేక అధికారుల పాలనే కొనసాగుతుంది.

నేటి నుంచి విజయవాడ రైలు రద్దు

కొత్తగూడెంఅర్బన్‌: భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్‌ నుంచి విజయవాడ వరకు నడిచే ఎక్స్‌ప్రెస్‌ రైలు సోమవారం నుంచి తాత్కాలికంగా రద్దు చేసినట్లు స్టేషన్‌ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో రైల్వే లైన్‌ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు రద్దు చేసినట్లు వివరించారు. ప్రయాణికులు గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి



కిన్నెరసాని జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్‌: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో సందర్శకులు సందడి చేశారు. ఆదివారం సెలవుదినం కావడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా డ్యామ్‌ సమీపం నుంచి జలాశయాన్ని, డీర్‌ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 573 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా, వైల్డ్‌లైఫ్‌ శాఖకు రూ.20,040 ఆదాయం లభించగా, 250 మంది బోటు షికారు చేయగా, టూరిజం కార్పొరేషన్‌ సంస్థకు రూ.14,400 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

9 నుంచి తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు

ఖమ్మంగాంధీచౌక్‌ : నెల నెలా వెన్నెల ఏడో వార్షికోత్సవం సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలను ఈ నెల 9, 10, 11 తేదీల్లో ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు ఖమ్మం కళాపరిషత్‌ అధ్యక్షుడు నాగబత్తిని రవి, అన్నాబత్తుల రవీంద్రనాథ్‌ కళా సాంస్కృతిక సంస్థ(ఆర్క్స్‌) కార్యదర్శి అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్‌ తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. నెల నెలా వెన్నెల ఏడో వార్షికోత్సవం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి 9 నాటికలను ఎంపిక చేశామని తెలిపారు. రోజుకు మూడు నాటికలు ప్రదర్శిస్తామని చెప్పారు. జిల్లాకు చెందిన మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి రోజుకొకరు అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

నేటితో నేలమట్టం

- కేటీపీఎస్‌ పాత ప్లాంట్‌ కూలింగ్‌ టవర్ల కూల్చివేతకు రంగం సిద్ధం
- హెచ్‌ఆర్‌ కమర్షియల్‌ సంస్థ, ఎక్సిక్యూడ్‌ కంపెనీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- నిమిషాల వ్యవధిలోనే నేలమట్టం కానున్న 8 టవర్లు



నేటితో కనుమరుగు కానున్న కేటీపీఎస్‌ ఓఅండ్‌ఎం కూలింగ్‌ టవర్లు

పాల్వంచ: పాల్వంచలోని కాలం చెల్లిన కొత్తగూడెం థర్మల్‌ పవర్‌ స్టేషన్‌(కేటీపీఎస్‌) పాత ప్లాంట్‌(ఓఅండ్‌ఎం)లోని కూలింగ్‌ టవర్లు కాలగర్భంలో కలిసిపోనున్నాయి. సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల మధ్యలో ఒక్కొటి చొప్పున మొత్తం 8 టవర్లు కూల్చివేయనున్నారు. పాత ప్లాంట్‌ తొలగింపు కాంట్రాక్ట్‌ దక్కించుకున్న హెచ్‌ఆర్‌ కమర్షియల్‌ సంస్థ.. టవర్ల కూల్చివేతను రాజస్థాన్‌ రాష్ట్రం జైపూర్‌కు చెందిన ఎక్సిక్యూడ్‌ కంపెనీకి అప్పగించింది. కంపెనీ డైరెక్టర్‌ ఆనంద్‌ శర్మ సారథ్యంలో ఇంప్లోషన్‌ పద్ధతిలో ఒకే చోట కుప్పకూలేలా పేలుడు పదార్థాలను ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారుజామున ట్రాన్స్‌కో శాఖ నుంచి విద్యుత్‌ లైన్ల క్లియరెన్స్‌ రాగానే కూల్చివేతకు సిగ్నల్‌ ఇవ్వనున్నారు. ఆ వెంటనే నిమిషాల వ్యవధిలో ఎక్స్‌ప్లోజివ్స్‌ పేలి టవర్లు నేలమట్టం కానుండగా, ముందుగా 'ఏ'స్టేషన్‌లోని నాలుగు టవర్లు, తర్వాత 'బీ'స్టేషన్‌లోని రెండు, 'సీ'స్టేషన్‌లలోని మరో రెండు టవర్లు కూల్చివేయనున్నారు. టవర్ల శకలాలు దూరంగా పడకుండా అక్కడే కుప్పకూలేలా పిల్లర్ల చుట్టూ ఐరన్‌ మెస్‌లను ఏర్పాటు చేసి, క్లాత్‌తో సీల్‌ చేశారు. దీంతో కూలే సమయంలో ఎక్కడా ప్రమాదాలు వాటిల్లకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే కర్మాగారంలోని మిగతా విభాగాలను తుక్కుగా మార్చి తరలించడంతో చివరికి ఈ టవర్లు మాత్రమే మిగిలి ఉన్నాయి.

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో వాయిదా?

జూలై 31వ తేదీనే కూలింగ్‌ టవర్లను నేలమట్టం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ పనులు చేసేందుకు అధికారులు సాహసించలేదని తెలుస్తోంది. అనుకోని ప్రమాదాలు జరిగితే అపవాదు మూటగట్టుకోవాల్సి వస్తుందని కూల్చివేతను నిలిపివేసినట్లు సమాచారం. కాగా ట్రాన్స్‌కో లైన్ల క్లియరెన్స్‌లో జాప్యం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ఇక నేడు ముహూర్తం ఖరారు చేశారు.

పటిష్ట భద్రత నడుమ..

కూలింగ్‌ టవర్ల కూల్చివేతపై కర్మాగారం చీఫ్‌ ఇంజనీర్‌ పి.వెంకటేశ్వరరావు అధికారులతో సమీక్ష నిర్వహించారు. పాల్వంచ డీఎస్పీ సతీష్‌ కుమార్‌, సీఐ వినయ్‌కుమార్‌, ఎస్‌పీఎఫ్‌ అసిస్టెంట్‌ కమాండెంట్‌ ఎ. అప్పాజీ, ఇన్‌స్పెక్టర్‌ కిరణ్‌, జెన్‌కో విజిలెన్స్‌ డీఎస్పీ రమేష్‌, ఎస్‌ఈ కిరణ్‌కుమార్‌లు టవర్ల కూల్చివేత ప్రాంతాలను పరిశీలించారు. సోమవారం ఉదయం కరకవాగు, అల్లూరిసెంటర్‌, పాండురంగాపురం రోడ్‌లలో ఎవరూ తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కర్మాగారంలోకి ఇతరులెవరూ రాకుండా అనుమతులు నిలిపివేశారు. కనీసం 200 మీటర్ల దూరం వరకు ఎవరూ వెళ్లొద్దని నిబంధనలు విధించారు. ఉదయం షిఫ్ట్‌ విధులకు వెళ్లే సిబ్బందిని కూడా నిలిపివేయనున్నారు.

1965–78 ప్రాంతంలో నిర్మాణం..

పాల్వంచ అంటే కేటీపీఎస్‌, దానిలో టవర్లు ఆనవాళ్లుగా చెప్పవచ్చు. 115 మీటర్ల ఎత్తులో ఉన్న ఇవి కొన్ని మైళ్లదూరం వరకు కనిపిస్తాయి. 1965–78 సంవత్సరంలో జపాన్‌ టెక్నాలజీతో కేటీపీఎస్‌ ఓఅండ్‌ఎం కర్మాగారాన్ని నిర్మించారు. ఏ,బీ,సీ, స్టేషన్లలోని 60 మెగావాట్ల సామర్థ కలిగిన 1,2,3,4 యూనిట్లు, 120 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 5,6,7,8 యూనిట్లు చేపట్టి... 720 మెగావాట్లతో రాష్ట్రానికి వెలుగులు పంచారు. ఒక్కో స్టేషన్‌కు ఒక్కో కూలింగ్‌ టవర్‌ చొప్పున మొత్తం 8 నిర్మించారు. విద్యుదుత్పత్తి చేసే క్రమంలో నీరు, బొగ్గు మండించిన క్రమంలో వేడిని తగ్గించేందుకు కూలింగ్‌ టవర్లు ఉపయోగపడతాయి. నాణ్యతా ప్రమాణాలతో నిర్మించడంతో ఇప్పటికీ చెక్కుచెదరక పోవడం విశేషం. కాగా పలువురు టవర్ల ఫొటోలు తీసి సోషల్‌ మీడియాలో బైబై ఓల్డ్‌ ప్లాంట్‌.. కూలింగ్‌ టవర్లు అంటు పోస్టులు చేశారు. ఆది నుంచి వివాదాస్పదంగానే ఈ పనులు సాగుతుండగా, చిట్టచివరి అంకం కూడా పూర్తి కావొచ్చింది. కాగా టవర్ల కూల్చివేతపై సీఈ పి.వెంకటేశ్వరరావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. అందుబాటులో లేరు.



టవర్లను పర్యవేక్షిస్తున్న ఎక్సిక్యూడ్‌ కంపెనీ డైరెక్టర్‌ ఆనంద్‌శర్మ

క్లుప్తంగా

ముంపు సమస్య పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: గోదావరి ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక అంబేడ్కర్‌కాలనీ, కొల్లుచెరువు ఏరియా, వీరబ్రహ్మం గుడి ప్రాంతాల్లోని వరద ముంపు ఇళ్లను ఆదివారం ఆయన పరిశీలించారు. మండలంలోని వరద కష్టాలు తెలుసునని, ముంపు సమస్య నుంచి బూర్గంపాడు మండలాన్ని కాపాడేందుకు శాశ్వత పరిష్కార మార్గాలను ఆలోచిస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కరకట్టల నిర్మాణాల ప్రతిపాదనలను అందించామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ సునీల్, పంచాయతీ కార్యదర్శి సమ్మయ్య, మాజీ ఎంపీపీ కైపు రోశిరెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మందా నాగరాజు, భజన సతీశ్, భజన ప్రసాద్, బర్ల నాగమణి, కైపు లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదనపు నిర్మాణం కూల్చివేత


అదనపు నిర్మాణాన్ని కూలుస్తున్న యజమాని

ఇల్లెందురూరల్: మండలంలోని 21 పిట్ ఏరియాకు చెదిన సింగరేణి మాజీ కార్మికురాలు దేవరాజుల సత్యమ్మ తాను నివాసం ఉంటున్న క్వార్టర్ ముందు భాగంలో గోడకట్టి రేకులు వేసింది. విషయం తెలుసుకున్న ఎస్‌అండ్‌పీసీ అధికారులు అక్కడకు చేరుకొని తొలగించాలని పట్టుబట్టారు. స్థానికులు అడ్డుకోవడంతో వారు వెళ్లిపోయారు. దీంతో సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న సత్యమ్మ ఇద్దరు కుమారులను విధుల్లోకి తీసుకోబోమని, కట్టిన అదనపు నిర్మాణాన్ని కూల్చివేయాలని యాజమాన్యం ఆదేశించింది. దీంతో వారు స్వయంగా అదనపు కట్టడాన్ని కూల్చేశారు.

బురదలో ఐదు కిలోమీటర్లు నడిచి..


కోడిగుడ్లు నెత్తిన పెట్టుకుని వెళ్తున్న అంగన్‌వాడీ టీచర్ జ్యోతి

కొత్తగూడెంరూరల్: కోడి గుడ్లు నెత్తిన పెట్టుకుని, బురదలో ఐదు కిలోమీటర్లు నడిచి గిరిజనులకు పౌష్టికాహారం అందించింది ఓ అంగన్‌వాడీ టీచర్. లక్ష్మీదేవిపల్లి మండలం గుట్టుమల్ల గ్రామ పంచాయతీ గంగమ్మకాలనీ అంగన్‌వాడీ టీచర్ జ్యోతి ఆదివారం దట్టమైన అటవీ ప్రాంతంలో ఐదు కిలోమీటర్లు నడిచి క్రాంతినగర్‌లోని బాలింతలు, గర్భిణులకు పంపిణీ చేశారు. ఈ క్రమంలో బురదమయంగా మారిన దారిలో కోడిగుడ్లు నెత్తిన పెట్టుకుని ఆమె నడిచి వెళ్లారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం


పాల్వంచ: బీటెక్ విద్యార్థి కనిపించకుండా పోయిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు చీమల నంగయ్య చిన్న కుమారుడు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. జూలై 7వ తేదీన ఇంటికి వచ్చాడు. ఈ నెల 2వ తేదీన కిరాణా దుకాణానికి వెళ్లి సరుకులు తెస్తానని బైక్‌పై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ అని వస్తోంది. దీంతో బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో ఆదివారం విద్యార్థి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రాఘవయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టేకు చెట్లు తొలగించారు..


టేకు చెట్లను కూల్చేసిన దృశ్యం

ములకలపల్లి: టేకు చెట్లను కూకటివేళ్లతో సహా తొలగిస్తున్న నేపథ్యంలో అటవీశాఖ అధికారులు దాడి చేశారు. మండలంలోని గండిపోలు గ్రామశివారులో సుమారు 20 ఏళ్ల వయసుకు పైబడిన టేకు చెట్లను తొలగిస్తుండగా సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు దాడి చేసినట్లు తెలిసింది. 24 చెట్లను నరికినట్లు ప్రాథమికంగా గుర్తించారని, నంబర్లు వేసి, జీసీబీని అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయమై జగన్నాథపురం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సతీశ్‌ను వివరణ కోరగా, టేకు చెట్లను తొలగిస్తున్న సమాచారం మేరకు దాడులు చేశామని, విచారణ చేస్తున్నామని తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర రూ.13,828

ఇక స్వచ్ఛదనం - పచ్చదనం

- నేటి నుంచి ఐదు రోజుల కార్యక్రమాలు
- గ్రామాలు, మున్సిపాలిటీలలో నిర్వహణ
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు


డ్రెయినేజీలో సిల్ట్ తొలగిస్తున్న సిబ్బంది

చుంచుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి ఐదు రోజులపాటు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం చేపట్టనుంది. గ్రామాలు, పట్టణాల్లో క్షేత్రస్థాయిలో పరిశుభ్రతపై కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని, ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ జితేశ్ వి. పాటిల్ ఇప్పటికే అధికారులను హెచ్చరించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని 481 గ్రామపంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. ఈనెల 9 వరకు నిర్వహించే రోజువారి కార్యక్రమాలకు సంబంధించి ఇప్పటికే కార్యాచరణ ప్రణాళికలను రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం విడుదల చేసింది. కాగా, కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలు, యువజన సంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆశ వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలను భాగస్వాములు చేయనున్నారు.

రోజువారీ కార్యక్రమాలు ఇలా:

- **సోమవారం:** జిల్లాలోని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో స్వచ్ఛదనం-పచ్చదనం ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించాలి. పారిశుద్ధ్య కార్మికులు, అధికారులు, మహిళా సంఘాలు, యువత అందరూ కలిసి వార్డులతో పాటు పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు, ఆర్టీసీ బస్టాండ్లు, హెల్త్ సెంటర్లలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలి. అనంతరం స్వచ్ఛదనం - పచ్చదనం మన బాధ్యత, ఇంటింటికీ తడి పొడి చెత్తను వేరు చేద్దాం, మన ఊరిని శుభ్రంగా ఉంచుదాం వంటి నినాదాలతో ర్యాలీలు చేపట్టాలి. పారిశుద్ధ్యం, తడి చెత్త పొడి చెత్త సేకరణ, రోడ్లు, కాల్వల పరిశుభ్రతపైన ప్రజల్లో అవగాహన కోసం సమావేశాలు నిర్వహించాలి. పాఠశాల విద్యార్థులకు పారిశుద్ధ్యం పైన వ్యాసరచన పోటీలు నిర్వహించాలి.
- **ఆగస్టు 6న:** గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఉన్న తాగునీటి ట్యాంకులు శుభ్రపరచాలి. అధికారులు తాగునీటి పరిశుభ్రత కోసం క్లోరినేషన్ పరీక్షలపై అవగాహన కల్పించాలి. ఇంకుడు గుంతలు లేని ఇళ్లను గుర్తించి తక్కువ ఖర్చుతో ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలి. చెరువులు, కాలువలకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలి. యూకలిప్టస్, వెదురు, సుబాబుల్ మొక్కలు నాటాలి.
- **ఆగస్టు 7న:** అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో మురికి కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలి. నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు చేపట్టాలి. రహదారుల మధ్య ఏర్పడిన గుంతలను గుర్తించి వాటిని పూడ్చాలి. జనసాంద్రత కలిగిన ప్రదేశాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలి.
- **ఆగస్టు 8న:** గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో జ్వర సర్వే నిర్వహించాలి. ప్రజల్లో వ్యక్తిగత పరిశుభ్రత పైన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. అలాగే గ్రామాలు, మున్సిపాలిటీల పరిధిలో కుక్కలు ఎన్ని ఉన్నాయో సుమారుగా గుర్తించాలి. పాఠశాలల్లో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, నీటి ద్వారా వచ్చే వ్యాధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి. జిల్లాలో ఏబీసీ సెంటర్ల ద్వారా కుక్కల రక్షణకు చేపడుతున్న కార్యక్రమాల గురించి అవగాహన చేపట్టాలి. అన్ని కార్యాలయాలు, పాఠశాలల్లో ఔషధ మొక్కలైన తులసి, రణపాల, తిప్పతీగ, నల్ల ఉసిరి, అలోవెరా మొక్కలను తప్పనిసరిగా నాటాలి.
- **ఆగస్టు 9న :** ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలను గుర్తించి కూల్చివేయాలి. ప్రతి ఇళ్లు, కార్యాలయాల్లో నిరుపయోగంగా ఉన్న పనికిరాని వస్తువులను తొలగించాలి. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులతో పాటు దుమ్ము వంటి వ్యర్థాలను తొలగించే కార్యక్రమాలు చేపట్టాలి.

అందరూ భాగస్వాములు కావాలి



జిల్లాలో సోమవారం నుంచి చేపట్టనున్న స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాల్లో గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అందరు అధికారులు భాగస్వాములు కావాలి. పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు రోజువారీ నిర్దేశిత కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేసి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.
– జితేశ్ వి.పాటిల్, జిల్లా కలెక్టర్

జూలైలో 93 శాతం బొగ్గు ఉత్పత్తి


ఓపెన్‌కాస్ట్‌లో బొగ్గు ఉత్పత్తి చేస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో జూలైలో సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లోని 22 భూగర్భ గనులు, 18 ఓపెన్ కాస్ట్ గనుల్లో సంస్థ నిర్దేశించిన 45.35 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 42.31లక్షల టన్నుల ఉత్పత్తి(93 శాతం) సాధించింది.

ఓసీల్లో 95 శాతం..

సింగరేణి సంస్థ ఈ ఏడాది నిర్దేశించుకున్న లక్ష్యాన్ని వివిధ ఏరియాల్లోని భూగర్భ గనులకు, ఓపెన్‌కాస్ట్ గనులకు కేటాయించగా, సింగరేణి వ్యాపిత 11 ఏరియాల్లో ఉన్న 18 ఓపెన్ కాస్ట్ గనులే ఉత్పత్తిలో రారాజుగా విరాజిల్లుతున్నాయి. జూలైలో 40.38 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి 38.19 లక్షల టన్నులు.. అంటే 95 శాతం మేర ఓసీలే సాధిస్తున్నాయి. వర్ష ప్రభావంతో 5 శాతం ఉత్పత్తిలో వెనుకంజలో ఉన్నాయి. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 22 భూగర్భ గనుల్లో 4.95 లక్షల టన్నులకు 4.11 లక్షల టన్నులు (83 శాతం) సాధించగా 17 శాతం వెనుకంజలో ఉన్నాయి.

నాలుగు ఏరియాల్లో 100 శాతం..

సింగరేణి వ్యాపిత 11 ఏరియాల్లో జూలైలో నాలుగు ఏరియాలు మాత్రమే 100 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించాయి. వాటిలో ఇల్లెందు ఏరియా 132 శాతంతో అగ్రస్థానంలో నిలవగా, 114 శాతంతో ఆర్జీ-2 రెండో స్థానంలో ఉంది. మణుగూరు ఏరియా 105 శాతంతో మూడో స్థానంలో, నాలుగో స్థానంలో ఆండ్రియాల ప్రాజెక్ట్ నిలిచాయి. మిగిలిన 7 ఏరియాల్లో కొత్తగూడెం 92 శాతం, బెల్లంపెల్లిలో 91, మందమర్రి 75, శ్రీరాంపూర్ 64, భూపాలపల్లి 63, ఆర్జీ-1 75, ఆర్జీ-3 ఏరియా 97 శాతంతో వెనుకంజలో ఉన్నాయి.

లక్ష్యం సాధించాలి



సింగరేణి వ్యాప్తంగా మిగిలిన 8 నెలల్లో రోజుకు రెండు లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలి. 11 ఏరియాల్లోనూ రోజు, నెలవారీ, వార్షిక లక్ష్యాలను కచ్చితంగా సాధించాలి. ఓసీ, భూగర్భ గనుల్లో ఏమైనా సాంకేతిక ఇబ్బందులు ఉంటే నా దృష్టికి తేస్తే పరిష్కార మార్గం చూస్తా.
– ఎన్.బలరామ్, సింగరేణి సీఎండీ

బొగ్గు ఉత్పత్తిలో పెద్దన్న పాత్ర



సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో కొత్తగూడెం ఏరియా బొగ్గు ఉత్పత్తిలో పెద్దన్న పాత్ర పోషిస్తోంది. వర్ష ప్రభావం ఉన్నప్పటికీ జూలైలో 9,18,018 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించింది. గత ఏప్రిల్ నుంచి జూలై వరకు 41,76,792 లక్షల టన్నులు సాధించింది. సింగరేణి వ్యాప్తంగా ఏ ఏరియా కూడా ఇంత మొత్తం సాధించలేదు.వీకే-7 ఓసీకి అనుమతి వస్తే మరికొంత ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంటుంది.
– శాలేంరాజు, కొత్తగూడెం ఏరియా జీఎం

బొగ్గు బావుల వేలం ఆపాలి..

- వాటిని సింగరేణికే కేటాయించాలి
- సింగరేణి పరిరక్షణ బస్సుయాత్ర సభలో నేతలు


టేకులపల్లి: కేటీసీలో సింగరేణి పరిరక్షణ యాత్రకు మద్దతు తెలుపుతున్న కార్మికులు

ఇల్లెందు: తెలంగాణలోని సింగరేణి బొగ్గు గనులను కేంద్రం ప్రైవేటీకరించబోతుందని, దేశ సహజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించబోతుందని, సింగరేణి ప్రాంతంలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును వేలం పెట్టిందని, ఈ వేలం రద్దు కోసం ప్రజలే పాలకుల మీద ఒత్తిడి పెంచాలని సీపీఎం రాష్ట్ర నాయకులు ఎస్.వీరయ్య, భూపాల్, ఆశయ్య, భద్రాద్రి జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య కోరారు. సీపీఎం చేపట్టిన సింగరేణి పరిరక్షణ బస్సుయాత్ర ఇల్లెందుకు చేరగా.. జేకేఓసీలో జరిగిన పిట్ మీటింగ్, కొత్త బస్టాండ్ సెంటర్‌లో జరిగిన సభల్లో నేతలు ప్రసంగించారు. బొగ్గును తవ్వి వెలికి తీయడం కోసం స్థాపించిన ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి అని, గోదావరి పరివాహక ప్రాంతాల్లో సింగరేణి సొంత ఖర్చులతో సర్వే నిర్వహించి బొగ్గు బ్లాకులను గుర్తించిందన్నారు. శ్రావణపల్లిలో సింగరేణి సంస్థ బొగ్గు తవ్వకాలు చేపట్టాలని, కానీ, వేలం పాట ద్వారా దక్కించుకోవాలని కేంద్రం పన్నాగం పన్నిందని తెలిపారు. నాలుగు బొగ్గు బ్లాకులను ప్రైవేట్ వారికి కట్టబెట్టారని, రానున్న కాలంలో బొగ్గు బ్లాకులన్నీ ప్రైవేట్ వారికి అప్పగించాలని చూస్తోందని, దీంతో సింగరేణి బలహీన పడి మూతపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని, కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలంను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఏజే రమేశ్, మండల కార్యదర్శి నబీ, కృష్ణ, కిరణ్, సిరాజ్ అహ్మద్, రజమొగిలి, మోహన్‌రావు, సుల్తానా, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు కలిసి రావాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిరక్షణ ఉద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆగస్టు 5న బస్సుయాత్ర ముగింపు కార్యక్రమం కొత్తగూడెంలో ఉంటుందని ఆయన తెలిపారు. ఆశయ్య, కనకయ్య, జగదీశ్ పాల్గొన్నారు.

అరబిందో కంపెనీ టెండర్ రద్దు చేయాలి

టేకులపల్లి: అరబిందో కంపెనీకి వచ్చిన టెండర్ రద్దు చేసి కోయగూడెం ఓసీ-3 బ్లాకును సింగరేణి సంస్థకు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మందా నర్సింహారావు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింగరేణి పరిరక్షణ బస్సుయాత్ర కోయగూడెం ఓసీకి చేరింది. ఈ సందర్భంగా అరబిందో కంపెనీకి కేటాయించిన కోయగూడెం ఓసీ-3 బ్లాక్ ప్రదేశాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. బొగ్గు గనుల వేలం ఆపాలని, కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి సింగరేణిని ప్రైవేటీకరించడం లేదని తెలివిగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కార్మికులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ఐక్యంగా సింగరేణి సంస్థ పరిరక్షణకు కదలిరావాలని పిలుపునిచ్చారు. రేపాకుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన పిట్ మీటింగ్‌లో ఈసం నరసింహారావు, కడుదుల వీరన్న, కుంజ రమేశ్, బానోత్ చందర్, బాలకృష్ణ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల శంకుస్థాపనకు సీఎం?

- సీతారామ లింక్ కెనాల్ పనుల ప్రారంభోత్సవానికి రూ.99.16 కోట్లు
- రిజర్వాయర్ కాలువల ఆధునికీకరణకు రూ.42.10 కోట్లు
- వంద పడకల ఆస్పత్రికి రూ.37.05 కోట్లు


స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ రెహమాన్, అధికారులు

వైరా: వైరా నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు ఈనెలలోనే సీఎం రేవంత్‌రెడ్డి రానున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో పోలీస్, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, నీటిపారుదల శాఖ అధికారులు హెలీప్యాడ్, బహిరంగ సభాస్థలి ఏర్పాట్లను ఆదివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. కాగా, సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి మార్చి 13వ తేదీన వైరా రిజర్వాయర్ కుడి కాలువ సమీపంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ రూ.99.16 కోట్ల అంచనాతో శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో పనులు నత్తనడకన సాగాయి. ఇటీవల మంత్రి తుమ్మల పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించడంతో అధికారులు పూర్తి చేయించారు.

వైరా రిజర్వాయర్ ఆధునికీకరణ..

కాగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వైరా రిజర్వాయర్ రెండో దశ ఆధునికీకరణ పనులకు రూ.42.10 కోట్లు మంజూరు చేయించారు. ఎడమ కాలువ పరిధిలోని 9.5 కిలోమీటర్ల నుంచి 13.5 కిలో మీటర్ల వరకు.. కుడి కాలువ పరిధిలో 7.8 కిలో మీటర్ల నుంచి 20.8 కిలో మీటర్ల వరకు రెండు వైపులా సైడ్‌వాల్స్‌ల నిర్మాణం చేయాల్సి ఉండగా ఖర్చు తగ్గించే పనుల్లో భాగంగా రెండు వైపులా సీసీ లైనింగ్ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎడమ కాలువ పరిధిలో విప్పలమడక నుంచి లింగన్నపాలెం వరకు సీసీ లైనింగ్ పనులు చేపడుతున్నారు. ఇదిలా ఉండగా వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు ఆనుకుని ఉన్న ఆరు ఎకరాల స్థలంలో రూ.37.50 కోట్ల అంచనా వ్యయంతో వంద పడకల ఆస్పత్రి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇటీవల కేవీసీఎం ఎస్‌ఆర్‌ఐ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 14.4 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించగా ఆ స్థలంలో గురుకుల పాఠశాల ఏర్పాటు చేసేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవతో వైరాలో శంకుస్థాపన చేయనున్నారు. మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డుల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అమృత్ 2.0 పథకం ద్వారా రూ.26.87 కోట్లు మంజూరవ్వగా పైపులైన్ నిర్మాణం, ట్యాంకుల నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం. కాగా, 50 వేల మంది హాజరయ్యేలా తుళ్లూరి కోటేశ్వరరావు పామాయిల్ తోట సమీపంలో 20 ఎకరాల స్థలం, హెలీప్యాడ్ కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలతో పాటుగా మిట్టపల్లి గార్డెన్ సమీపంలో స్థలాలను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, శీలం వెంకటనర్సిరెడ్డి, పమ్మి అశోక్, పణితి శ్రీను, పుచ్చకాయల వీరభద్రంతో పాటు ఆర్‌అండ్‌బీ ఎస్‌సీ హేమలత, ఏసీపీ రెహమాన్, తహసీల్దార్ శ్రీనివాసరావు, సీఐ సాగర్, ఆర్‌అండ్‌బీ డీఈ విద్యాసాగర్, ఏఈ విశ్వనాథం, ఎస్‌ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ పరిశీలించారు.

పూరిల్లు దగ్ధం


ప్రమాదంలో కాలిపోయిన పూరిల్లు

అశ్వారావుపేటరూరల్: అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. మండలంలోని వినాయకపురం కొత్తకాలనీకి చెందిన ఒంటరి మహిళ నాగళ్ల సీతమ్మ రోజులానే శనివారం రాత్రి ఇంట్లో దీపారాధన చేసి నిద్రించింది. కాగా, అర్ధరాత్రి సమయంలో దీపం కిందపడి మంటలు అంటుకున్నాయి. చుట్టు పక్కల వారు గమనించి నిద్రిస్తున్న సీతమ్మను బయటకు తీసుకురాగా, ఇంట్లో ఉన్న సామగ్రి అంతా మంటల్లో కాలిపోయాయి. స్థానికులు మంటలను అదుపు చేశారు. రూ.50 వేల నష్టం వాటిల్లిందని బాధితురాలు వాపోయింది.

ఆటో డ్రైవర్‌పై దాడి


దాడిలో గాయపడిన గణేష్

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం పట్టణంలోని ఐటీడీఏ రోడ్డులో ఆదివారం రాత్రి ఆటో డ్రైవర్ గణేష్ పై సుమారు 10 మంది యువకులు అకారణంగా దాడికి పాల్పడ్డారు. దాడి జరిగిన సమయంలో యువకులు గంజాయి సేవించినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దాడిలో గాయాలపాలైన గణేష్‌ను భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా గణేష్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నట్లు సమాచారం. దాడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఆటో డ్రైవర్ పై దాడికి పాల్పడిన యువకుల ఫొటోలు ప్రస్తుతం స్థానిక సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

2 కేజీల గంజాయి పట్టివేత


గంజాయి, నిందితుడితో సీఐ సతీశ్‌కుమార్, సిబ్బంది

మణుగూరుటౌన్: బాపనకుంటలోని ఓ ఇంట్లో దాచి ఉంచిన రెండు కేజీల గంజాయిని పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. బాపనకుంటకు చెందిన పెనుగొండ గురవయ్య గతంలో పలుమార్లు గంజాయి క్రయ, విక్రయాల కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు. ఈ క్రమంలో సీఐ సతీశ్‌కుమార్, డాగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో గురవయ్య ఇంట్లో తనిఖీ చేశారు. పెరట్లో గొయ్యిలో దాచి ఉంచిన రెండు కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సమీపంలోని అనుమానిత వ్యక్తుల ఇంట్లో కూడా తనిఖీలు నిర్వహించారు. అనంతరం సుర్జా బస్టాండ్‌లో జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో పుల్లందాస్, వీర షమీమ్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

రేకుల షెడ్డు కూలి వ్యక్తి మృతి


కూలిన గోడల మధ్య వెంకన్న మృతదేహం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని తాతగుడి సెంటర్‌లో రేకులషెడ్డు కూలి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. తాతగుడి సెంటర్‌లో వీరాంజనేయులు సాయిరామ్ టిఫిన్ సెంటర్ నడిపిస్తున్నాడు. అందులో పనిచేస్తున్న కత్తిబోయిన వెంకన్న (46).. టిఫిన్ సెంటర్ పక్కన ఉన్న సతీశ్‌కు చెందిన రేకులషెడ్డులో ఉంటున్నాడు. ఆదివారం ఉదయం మంచినీరు పట్టుకునేందుకు వెళ్లిన వెంకన్నపై ఒక్కసారిగా రేకుల షెడ్డు కుప్పకూలింది. దీంతో హోటల్ నిర్వాహకులు పోలీసులు, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని గోడల మధ్యలో ఇరుక్కున్న వెంకన్నను బయటకు తీశారు. కాగా, అప్పటికే వెంకన్న మృతి చెందినట్లు స్థానిక వైద్యులు ధ్రువీకరించారు. టౌన్ ఎస్‌ఐ విజయలక్ష్మి ఘటనా స్థలానికి చెరుకుని వివరాలు నమోదు చేశారు. హోటల్ నిర్వాహకులు, రేకుల షెడ్డు యజమాని సతీశ్ వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం వెంకన్న మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, వెంకన్న 18 ఏళ్ల వయసులో తమ హోటల్‌కు వచ్చాడని, అప్పటి నుంచి అన్నీ తామే అయ్యి చూసుకుంటున్నామని టిఫిన్ సెంటర్ నిర్వాహకులు వీరాంజనేయులు, ఆయన భార్య పద్మ, కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకన్న మృతితో వారు కన్నీటి పర్యంతమయ్యారు. టిఫిన్ సెంటర్ నిరాహకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని టౌన్ ఎస్‌ఐ విజయలక్ష్మి తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో శనివారం పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో పలువురు మావోయిస్టులు తప్పించుకోగా ఘటనా ప్రాంతంలో రెండు శక్తివంతమైన మందుపాతరలను స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఛత్తీస్‌గఢ్‌లో చేపట్టిన కూంబింగ్ ఆపరేషన్లలో భాగంగా ఆదివారం నారాయణపూర్ జిల్లా కచ్చపాల్ సమీపంలోని అటవీప్రాంతంలోకి వెళ్లగా మావోయిస్టులు పోలీసు బలగాల పైకి కాల్పులు జరిపారు. పోలీసు బలగాలు సైతం ఎదురుకాల్పులు జరిపారు. ఈ సందర్భంలో మావోయిస్టులు తప్పించుకొగా.. సుమారు 10 కిలోల సామర్థ్యం కలిగిన రెండు శక్తివంతమైన మందుపాతరలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

యువకుడిపై దాడి

ఇల్లెందు: పట్టణంలోని జగదాంబసెంటర్‌కు చెందిన ఓ యువకుడిపై అదే ఏరియాకు చెందిన ముగ్గురు యువకులు దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ లింగయ్య కేసు నమోదు చేశారు. జగదాంబసెంటర్‌కు చెందిన కల్యాణ్‌లోద్‌పై అదే ఏరియాకు చెందిన రిషి, శ్రీరామ్, తరుణ్ దాడి చేశారు. గాయనపిన కల్యాణ్‌లోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పోలీసులమంటూ యువకులపై...

కొత్తగూడెంటౌన్: పెనగడప పంచాయతీ సమీపంలో రీల్స్ చేసుకుంటున్న యువకులపై పోలీసుల మంటూ వచ్చిన కొందరు దాడికి పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పెనగడప సమీపంలో రీల్స్ చేసుకుంటున్న తమ వద్దకు టూటౌన్ పోలీసులమంటూ కారులో వచ్చిన ఆరుగురు కొట్టారని యువకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యుత్ శాఖలో త్వరలో పదోన్నతులు, బదిలీలు

ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి


వరుణ్‌రెడ్డికి మొక్క అందజేస్తున్న శేషగిరిరావు దంపతులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖ ఉద్యోగులకు త్వరలో పదోన్నతులు, బదిలీలు ఉంటాయని వరంగల్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. ఖమ్మంలోని చల్లపల్లి గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన టీఈఈ 1104 యూనియన్ నాయకుడు తక్కెళ్లపల్లి శేషగిరి రావు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో సీఎండీ మాట్లాడారు. వచ్చే అక్టోబర్ నాటికి 2,400 జూనియర్ లైన్లమెన్ల నియామకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యుత్ సిబ్బందికి అన్ని రకాల భద్రత పరికరాలు అందించామని, ప్రమాదాలు జరగకుండా కార్మికులు, ఉద్యోగులు, అధికారులు వాటిని వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జి డైరెక్టర్ టి. సదర్‌లాల్, మాజీ డైరెక్టర్ బి.వెంకటేశ్వరరావు, విజిలెన్స్ అధికారి జనార్దన్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రసిడెంట్ ఎస్.సుధీర్, అదనపు కార్యదర్శి వి. వరప్రసాద్, అడ్వైజర్ జనార్దన్ రెడ్డి, రఘునందన్, ఖమ్మం సర్కిల్ ఎస్ఈ సురేందర్, డీఈ రామారావు, బాబూరావు, హీరాలాల్, నాగేశ్వరరావు, భద్రు తదితరులు పాల్గొన్నారు.